క్లుప్తంగా

21న కంటి వైద్య శిబిరం

నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక జిల్లా ఆస్పత్రిలో ఈ నెల 21న కంటి చికిత్స శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ బి శివారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో ప్రత్యేక కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైనవారిని ప్రత్యేక అంబులెన్స్ ద్వారా వేణుగొండలోని రాంరెడ్డి కంటి ఆస్పత్రికి ఆపరేషన్ నిమిత్తం పంపనున్నట్లు పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హాజరయ్యేవారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తీసుకురావాలని పేర్కొన్నారు.

నేడు సత్యనారాయణ స్వామి వ్రతాలు

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని రామాలయంలో శ్రావణ పౌర్ణమి పురస్కరించుకొని సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు కే వరదరాజన్ అయ్యంగార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఏఓ బదిలీ

లింగాల: మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి సాధారణ బదిలీలలో భాగంగా జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రస్తుతం బల్మూర్ ఏఓ కావేటి నరేష్‌కు మండలానికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. కాగా బదిలీపై వెళ్లిన ఏఓ నాగార్జునరెడ్డి 2012 నుంచి 2024 వరకు 12 ఏళ్ల పాటు సుదీర్ఘంగా పని చేసి ప్రజల మన్ననలు పొందారు.

వాలీబాల్ కిట్ వితరణ



లింగాల: మండల కేంద్రంలోని రామాలయం వాలీబాల్ జట్టుకు ఆదివారం మండల యువజన కాంగ్రెస్ నాయకుడు సన్నాయిల రాజేష్ వాలీబాల్ కిట్‌ను వితరణ చేశారు. కార్యక్రమంలో రవివర్మ, గాలేటి మధు, సలేశ్వరం, కర్ణ, వంశీ, వెంకటేష్, శ్రీకాంత్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

'మతిభ్రమించి మాట్లాడుతున్నారు'



మన్ననూర్: మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులు మతిభ్రమించి ఆలోచన లేకుండ మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పెర్ముల వెంకటేశ్వర్లు విమర్శించారు. ఆదివారం స్థానిక ఓం చౌరస్తాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు నాటికి రూ.16 వేల కోట్ల ధనిక రాష్ట్రంగా ఉందని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక 10 ఏళ్లలో రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసిందని వాపోయారు. సీఎం రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ. 2 లక్షల రుణమాఫీ చేసి చూపించారన్నారు. ప్రజా ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ప్రజలే సరైన గుణపాఠం చెప్పుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వెంకటరమణ, రహీం, హన్మంత్‌రెడ్డి, జాఫర్ పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం అధ్యక్షుడి ఎన్నికపై ఓటింగ్



అచ్చంపేట: పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికలు ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కాగా అచ్చంపేట పద్మశాలి కమ్యూనిటీ భవన్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఎన్నికల అధికారిగా బోడ రవీందర్ వ్యవహరించగా 70 శాతం ఓట్లు పోలయ్యాయి. సోమవారం ఎన్నికల కౌటింగ్ ఫలితాలు వెల్లడిస్తారని పద్మశాలి సంఘం అధ్యక్షుడు పులిజాల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కోట కిశోర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్లికంటి కృష్ణయ్య, కర్నాటి రాములు పాల్గొన్నారు.

వాహనాల పట్టివేత

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని నర్సాయిపల్లిలో కొంత కాలంగా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా గుట్టలను తవ్వి మట్టిని తరలిస్తున్న టిప్పర్లను గ్రామస్తులు పట్టుకుని ఆదివారం పోలీసులకు అప్పగించారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహన యజమానులపై చర్యలు తీసుకోవాలని వనపట్ల, నర్సాయిపల్లి గ్రామస్తులు కోరారు. ఈ సందర్భంగా మూడు టిప్పర్లు, ఒక జేసీబీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.





తెలకపల్లిలో ..



అచ్చంపేటలో..



కల్వకుర్తిలో..

రాఖీ దుకాణాలు కిటకిట

కల్వకుర్తిరూరల్: ఆడపడుచుల అనురాగానికి, ఆత్మీయతకు ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆదివారం కల్వకుర్తి పట్టణంలో రాఖీలు కొనుగోలు చేసేందుకు మహిళలు వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. పలు చౌరస్తాలు మహిళలతో కిటకిటలాడాయి. వస్త్ర దుకాణాలు రద్దీగా కనిపించాయి. రాత్రి వరకు రాఖీ దుకాణాల వద్ద బారులు తీరారు. ఆర్టీసీ బస్సులు మహిళలతో నిండిపోయాయి.

తెలకపల్లి: మండల కేంద్రంలో పలు రాఖీ దుకాణాల వద్ద మహిళలు పెద్ద ఎత్తున గుంపులుగా కనిపించారు. రాఖీలు కొనుగోలు చేసి అన్నాదమ్ములకు రాఖీ కట్టేందుకు పుట్టింటికి బయలుదేరారు. అదే విధంగా మిఠాయి దుకాణాల వద్ద ఆడపడుచుల సందడి నెలకొంది.



కల్వకుర్తిలో బస్సు ఎక్కుతున్న మహిళలు

కోడేరు: మండల కేంద్రంలో ప్రత్యేకంగా రాఖీ విక్రయ దుకాణాలు ఏర్పాటు చేశారు. పలు వస్త్ర, రాఖీ దుకాణాలు మహిళలతో కిటకిటలాడాయి. పలు గ్రామాల నుంచి మహిళలు రావడంతో పలు కూడళ్లు రద్దీగా దర్శనమిచ్చాయి.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని బస్టాండ్ దగ్గర రాఖీ దుకాణాలు ఏర్పాటు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి మహిళలు రాఖీలు కొనడానికి తరలివచ్చారు.

తాడూరు: మండల కేంద్రంలో రాఖీలు విక్రయకేంద్రాల వద్ద మహిళలు సందడి చేశారు. కొత్త కొత్త ఆకృతుల్లో ఉన్న రాఖీలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు.



తాడూరులో..



పెంట్లవెల్లిలో..

ఘనంగా పాపన్నగౌడ్ జయంతి



ఉప్పునుంతలలో నివాళులర్పిస్తున్న నాయకులు



కల్వకుర్తి మండలం తర్నికల్‌లో..

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి కౌండిన్య దళం మండల అధ్యక్షుడు ఉదయ్ గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనుల రాజ్యాధికారం కోసం ఎన్నో పోరాటాలు చేసిన పాపన్నను ఆదర్శంగా తీసుకుని వారి అభివృద్ధికి యువకులు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కౌండిన్య దళం సభ్యులు ప్రసాద్‌గౌడ్, సాయికుమార్‌గౌడ్, భరత్‌గౌడ్, రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం కార్యదర్శి సురేష్‌గౌడ్, గ్రామ అధ్యక్షుడు పరుశరాం గౌడ్, రాఘువేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, పాండు గౌడ్, నరేందర్ గౌడ్, వరప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: మండల కేంద్రంలో ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాపన్నగౌడ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, గౌడ సంఘం నాయకులు తిప్పతయ్యగౌడ్, శేఖర్‌గౌడ్, బాలగౌడ్, వెంకటయ్యగౌడ్, గణేష్‌గౌడ్, నరేష్‌గౌడ్, శ్రీనుగౌడ్, లక్ష్మయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని కొండూరులో పాపన్న గౌడ్ 374 జయంతిని గౌడ సంఘం గ్రామ అధ్యక్షుడు వెంకట్రాములు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎల్లాగౌడ్, రవి, వసంత, విజయ్ పాల్గొన్నారు.



పెంట్లవెల్లి మండలం కొండూరులో ..



పెద్దకొత్తపల్లిలో..

రేపు రౌండ్ టేబుల్ సమావేశం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ బీసీ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమగ్ర కులగణన, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌తో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. బీసీలు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని కుమ్మెర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2013–14వ సంవత్సరంలో చదివిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువాలను శాలువాతో సన్మానించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుడిపల్లి నిరంజన్, గోవింద్ రెడ్డి, బాలయ్య గౌడ్, ఆంజనేయులు, శివకుమార్, శేఖర్, రమేశ్, మునీర్, సందీప్, శివశంకర్, సుధాకర్, మౌనిక, గీత, నిర్మల, కళ్యాణి, బీమమ్మ తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన వ్యక్తులపై కేసు నమోదు

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన చంద్రశేఖర్‌పై అదే గ్రామానికి చెందిన ఇద్దరి వ్యక్తులు దాడి చేసి గాయపర్చిన ఘటనలో ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. హైదరాబాద్ నుంచి వెల్దండకు వస్తున్న తల్లి మారెమ్మను తీసుకొచ్చేందుకు చంద్రశేఖర్ బైక్‌పై వెళ్లాడు. బస్టాండ్‌లో బైక్‌ను నిలిపి బస్సు దగ్గరకు వెళ్లాడు. తల్లిని ఇంటికి తీసుకెళ్లేందుకు బైక్ వద్దకు తీసుకొచ్చాడు. అప్పటికే బైక్‌పై కూర్చున్న పవన్‌ను దిగాలని సూచించాడు. దీంతో అకారణంగా చంద్రశేఖర్‌పై దాడికి దిగాడు. అంతటితో ఆగక మిత్రుడి మహేశ్‌కు ఫోన్ చేసి పిలిపించి బైక్‌తో చంద్రశేఖర్ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్‌కు గాయాలయ్యాయి. మారెమ్మ ఫిర్యాదు మేరకు పవన్, మహేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

హిందువులపై దాడులను ఖండించాలి

కొల్లాపూర్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ క్షేత్ర సంయోజక్ కుమారస్వామి అన్నారు. ఆదివారం పట్టణంలోని మాధవస్వామి దేవాలయంలో భజరంగ్‌దళ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో మైనార్టీ వర్గాలపై ఎక్కడైనా చిన్నపాటి దాడి జరిగినా నానా హంగామా చేసే రాజకీయ పార్టీలు బంగ్లాదేశ్‌లో హిందువులను ఊచకోతలు కోస్తున్నా కనీసం నోరు మెదపడం లేదని విమర్శించారు. కొన్ని పార్టీలు హిందువులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయన్నారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర విభాగ్ గోరక్ష సంయోజక్ సురేష్, పాలమూరు సంయోజక్ గూడెం రమేష్‌లు పాల్గొన్నారు.

జిల్లా సంయోజక్ అధ్యక్షుడిగా పురేందర్

నాగర్‌కర్నూల్ జిల్లా సంయోజక్ కమిటీని కుమారస్వామి సమక్షంలో ఎన్నుకున్నారు. సంయోజక్ కమిటీ అధ్యక్షుడిగా కొల్లాపూర్ పట్టణానికి చెందిన సుంకరి పురేందర్, మండల సంయోజక్‌గా ఇటికెల రాజుయాదవ్, పట్టణ సంయోజక్‌గా పులి భరత్, సహ సంయోజక్‌గా తెర్లాపల్లి రమేష్, కొమ్ము భానుప్రకాష్, పిట్టల లక్ష్మణ్, మండల గోరక్షక్‌గా గుగ్గిల్ల మహేష్, పల్లె మహేష్ ఎన్నికయ్యారు. విద్యార్థి ప్రముఖ్‌గా క్రమదాటి శ్రీకాంత్, సురక్ష ప్రముఖ్‌గా చాపల వంశీ, సొప్పరి రవికుమార్, సత్సంగ్ ప్రముఖ్‌గా తుపాకుల రమేష్, శ్రీనివాస్, శారీరక్ ప్రముఖ్‌గా గువ్వల పవన్‌ను ఎన్నుకున్నారు.



నూతన కమిటీ సభ్యులు

భక్తిశ్రద్ధలతో నూలి పూర్ణిమ ఉత్సవాలు



శోభాయాత్ర నిర్వహిస్తున్న నాయకుల, చిన్నారులు

కల్వకుర్తి: రాఖీ పౌర్ణమి సందర్భంగా పద్మశాలీలు నూలి పూర్ణిమ ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్త మార్కండేయ దేవాలయం నుంచి శోభాయాత్ర కొనసాగింది. పట్టణంలోని ప్రధాన రహదారుల మీదుగా సాగింది. మహిళలు, యువకులు, నృత్యాలు చేశారు. ఊరేగింపులో భజనలు చేస్తూ ముందుకు సాగారు. కోలాటాలతో చిన్నారులు అలరించారు.

పిడుగుపాటుకు జీవాలు మృతి

అమ్రాబాద్: పిడుగుపాటుకు మూగ జీవాలు మృతి చెందిన ఘటన అమ్రాబాద్ మండలంలోని తాటిచెలుక అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. ఒంగురోనిపల్లికి చెందిన వీణమోని బాలయ్య, కుమ్మరోనిపల్లికి చెందిన మేడమోని నారయ్య తదితరులు జీవాలను మాధవానిపల్లి అటవీ ప్రాంతంలోని తాటిచెలుక ప్రాంతంలో మేత కోసం ఉంచారు. కాగా ఆదివారం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగుపడి బాలయ్యకు చెందిన 14 గొర్రెలు, జబ్బు తిరుపతయ్యకు చెందిన 6, నారయ్యకు చెందిన 6 మేకలు మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ. 2.50 లక్షలు ఉంటుందని ప్రభుత్వం ఆర్థికసాయం అందజేసి ఆదుకోవాలని పెంపకందారులు కోరారు.

సంప్రదాయాలను కాపాడుకుందాం



మాట్లాడుతున్న కట్ట ప్రభాకర్‌రెడ్డి

తెలకపల్లి: సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుందామని ఆర్‌ఎస్‌ఎస్ పాలమూరు విభాగ్ బహుదిక్ ప్రముఖ కట్ట ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని యోగా భవనంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారతీయ సంస్కృతి గొప్పదన్నారు. నాకు నీవు రక్షా, నీకు నేను రక్షా మనమంతా దేశానికి రక్షా అంటూ రాఖీ సంబరాలు నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బచ్చన్న, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

వినాయక మండప నిర్మాణానికి భూమి పూజ

పాన్‌గల్: మండల కేంద్రంలోని యాదవ యూత్ ఆధ్వర్యంలో నిర్మించే వినాయక మండపం నిర్మాణానికి ఆదివారం సంఘం నాయకుల ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. మండప నిర్మాణంతో వినాయకుని ప్రతిష్టకు ఇబ్బందులు తొలుగుతాయని సభ్యులు పేర్కొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

సీసీ రోడ్డుపై స్తంభాలతో ఇక్కట్లు



దేవల్‌తిరుమలాపూర్‌లో రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభం

మండలంలోని దేవల్‌తిరుమలాపూర్‌లో సీసీ రోడ్డుపై విద్యుత్ స్తంభాలు ప్రమాదభరితంగా ఉన్నాయి. వాహనదారుల రాకపోకలు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గ్రామస్తులు ప్రమాదాలభారిన పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. విద్యుత్‌స్తంభాలు తొలగించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు. నిర్లక్ష్యం వీడి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

– పెద్దకొత్తపల్లి

సంప్రదించవలసిన అధికారి: ప్రదీప్‌గౌడ్, ఏఈ, పెద్దకొత్తపల్లి సెల్: 9440813496

మాజీ ఎమ్మెల్యే కిష్టారెడ్డికి నివాళి



కల్వకుర్తిలో నివాళులర్పిస్తున్న అభిమానులు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తా, వైఆర్‌ఆర్ కాంప్లెక్స్, గిరిజన గురుకుల పాఠశాల ఆవరణలో మాజీ ఎమ్మెల్యే కిష్టారెడ్డి 4వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు, నాయకులు, ప్రజాప్రతినిధులు కిష్టారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ సత్యం మాట్లాడుతూ తండ్రి కిష్టారెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తానన్నారు. వేణు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట మాజీ ఎమ్మెల్యే కిష్టారెడ్డి చిత్రపటానికి మాజీ ఎంపీపీ పుట్టరాంరెడ్డి, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కల్వకుర్తి నియోజకవర్గానికి చేసిన సేవలను గుర్తు చేశారు. నాయకులు వెంకటయ్యగౌడు, రఘురామయ్య, జంగయ్య, ఐజాక్, శేఖర్‌ముదిరాజ్, మధుసూదన్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, లింగం, తదితరులు ఉన్నారు.

చారకొండ: మండలంలోని జూపల్లిలో నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి 4వ వర్ధంతితో డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకటయ్య యాదవ్ హాజరయ్యారు. నాయకులు ముజ్జు, రామచంద్రి, కమాల్‌ోద్దీన్, సుల్తాన్, సత్యం యాదవ్, కొండల్ గౌడ్, శ్రీరాములు గౌడ, రామస్వామి, వెంకటయ్య గౌడ్ ,శ్రీను తదితరులు ఉన్నారు.

కళాకారుడు బాలస్వామి మృతి తీరనిలోటు



నివాళులర్పిస్తున్న గోరటి వెంకన్న

చారకొండ: కళాకారుడు, జూపల్లి మాజీ ఎంపీటీసీ అర్కంటి బాలస్వామి(52) మృతి కళారంగానికి, తీరనిలోటు అని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి బాలస్వామి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ప్రజాప్రతినిధులు జూపల్లి గ్రామానికి చేరుకొని బాలస్వామి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. వెల్దండ మండలం సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ రావు రూ.50 వేలు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు సంజీవ్‌కుమార్ రూ.10 వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. కళాబృందం సభ్యుడు మురళి, నాయకులు, విజయ్ కుమార్ రెడ్డి, వెంకటయ్య యాదవ్, రాములు యాదవ్, విజయ్‌గౌడ్, ముజ్జు, సాంబయ్య గౌడ్, పుట్ట రాంరెడ్డి, ఐజాక్, జగపతి ఉన్నారు.

ప్రతి ఒక్కరు భక్తిభావంతో మెలగాలి



ఆచారిని సన్మానిస్తున్న నాయకులు

కల్వకుర్తిరూరల్: సమాజంలోని ప్రతి ఒక్కరు భక్తి భావంతో మెలగాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి అన్నారు. ఆదివారం పట్టణ సమీపంలోని కైలాసం గుట్టపై భక్తమార్కండేయ స్వామి దేవస్థాన నిర్మాణం పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవ చింతనతో ఓర్పు, నేర్పు చేకూరుతాయన్నారు. పద్మశాలీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రాజేందర్, పాండు, నర్సింహా, అక్షర శ్రీను, నాయకులు దుర్గాప్రసాద్, కృష్ణగౌడ్, శేఖర్‌రెడ్డి, రాఘవేందర్ గౌడ్, ఆనంద్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, మిరియాల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ల నిర్లక్ష్యం



మన్ననూర్ అంబేడ్కర్ కూడలిలో రోడ్డుపై బస్సు నిలిపి టికెట్లు ఇస్తున్న టిమ్ డ్రైవర్

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ 765 జాతీయ ప్రధాన రహదారిలో రోడ్డు నిబంధనలకు విరుద్ధంగా ఆర్టీసీ డ్రైవర్లు వ్యవహరిస్తున్నారు. ఈ దారిగుండా శుక్ర, శని, ఆదివారాలతో పాటు సెలవు దినాలలో వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు కొనసాగుతాయి. పికెట్ డిపోకు చెందిన బస్సు డ్రైవర్లు నిబంధనలు పాటించకుండా వెనుక నుంచి వచ్చే వాహనాలు ముందుకు వెళ్లే అవకాశం లేకుండ మన్ననూర్‌లోని అంబేడ్కర్ కూడలీ బస్‌స్టాఫ్ వద్ద రోడ్డుపైనే వాహనాలను నిలుపుతున్నారు. ప్రయాణికులను కిందకు దించి, టిమ్ సర్వీసులు కావడంతో (డ్రైవరు కండక్టర్ ఒక్కరే) టికెట్ ఇచ్చేంత వరకు రోడ్డుపైనే బస్సును నిలిపి ఇతర వాహనదారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పికెట్ డిపో యాజమాన్యం స్పందించి ఈ రహదారిలో వచ్చే డ్రైవర్ల నిబంధనలు పాటించేవిధంగా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

21న ఉర్సు

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): మండలంలోని పాలెంలో 21న ఉర్సు నిర్వహించనున్నట్లు మతపెద్దలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 23 తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించాలని కోరారు. భక్తులకు తగిన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పరిసరాలను పరిశుభ్రం చేసినట్లు వివరించారు.